క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న కారోబార్లు

మొగుళ్లపల్లి : ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన సురేందర్‌ను గురువారం మండలంలోని గ్రామపంచాయతీ కారోబార్ల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.కె అబ్దుల్ ముతలీబ్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, నగేష్, తిరుపతి, రవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీరామ్మూర్తి



శ్రీరామ్మూర్తిని శాలువాతో సన్మానిస్తున్న కార్యదర్శులు

మల్హర్ : మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ రామ్మూర్తికి గురువారం బాధ్యతలు అప్పగించారు. గతంలో ఎంపీడీగా పనిచేసిన శ్రీనివాస్ ఆగస్టు 31న పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. కాగా అతని స్థానంలో జిల్లా అధికారులు శ్రీరామ్మూర్తిని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను పంచాయతీ కార్యాదర్శులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ మహేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్ : దివ్యాంగులకు, వృద్ధులకు తదితర పింఛన్‌దారులకు ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచాలని ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎం కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రమౌళి మాట్లాడారు.

నిబంధనలు పాటించాలి



కాటారం : ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలని మండల విద్యాధికారి శ్రీదేవి సూచించారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం మండలంలోని ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, డ్రైవర్‌ల వివరాలు, లైసెన్స్, పాఠశాలల రికగ్నైజేషన్ పత్రాలను పరిశీలించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూడైస్‌లో పిల్లల వివరాలు నమోదు చేయాలని ఆలస్యం వహించొద్దన్నారు. ఈ సమావేశంలో పలు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

బోరుకు స్టార్టర్ ఏర్పాటు



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలోని ఎస్సీ కాలనీలో బోరు బావికి సంబంధించిన స్టార్టర్ రిపేర్‌కు రావడంతో నీటికి కటకట ఏర్పడింది. ఇదే విషయాన్ని సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితం కాగా పంచాయతీ అధికారులు స్పందించారు. కార్యదర్శి సమ్మయ్య స్టార్టర్ ఏర్పాటు చేసి ఎస్సీ కాలనీ వాసులకు నీరందించారు.

సాక్షి ఎఫెక్ట్..

నిమజ్జనానికి ఏర్పాట్లు

వాజేడు : మండల పరిధిలోని పూసూరు, ముల్లెకట్ట బ్రిడ్జి వద్ద అధికారులు నిమజ్జన ఏర్పాట్లు చేశారు. గోదావరి బ్రిడ్జి నుంచి పావన గోదావరిలో వినాయక ప్రతిమలను అధికారుల సమక్షంలో నిమజ్జనం చేయనున్నారు. వాజేడు, ఏటూరునాగారం జాయింట్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రెండు మండలాల అధికారులు దగ్గర ఉండి పనులను చేయిస్తున్నారు. గురువారం బ్రిడ్జిపై శుభ్రం చేయించారు. గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పైసలిస్తేనే పంచాయతీలో నమోదు

- ఇంటి నిర్మాణాల అనుమతికి నగదు డిమాండ్
- ఆన్‌లైన్‌లో ఇల్లు లేదని వెళ్తే మరో రకమైన దోపిడీ
- ఆందోళనలో గ్రామస్తులు

గణపురం : స్థానిక మేజర్ గ్రామపంచాయతీకి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. సంబంధిత అధికారుల వద్దకు నూతన ఇంటి నిర్మాణాల పర్మిషన్‌కు వెళ్లిన, తాము ఎన్నో ఏళ్లుగా నివాసముంటు పంచాయతీకి ఇంటి, నల్లా పన్నులు చెల్లిస్తున్నారు. అయితే తమ ఇంటి నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వారు బెంబేలెత్తుతున్నారు. మండలకేంద్రంలో సుమారు 6వేల ఇళ్లు ఉన్నాయి. కాగా కొత్త ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ



గణపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

పర్మిషన్ కోసం గ్రామ పంచాయతీకి వెళ్తే సంబంధిత అధికారులు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇంటి నిర్మాణానికి తీసుకోవాల్సిన డబ్బులకు అదనంగా ఇస్తేనే పర్మిషన్ ఇస్తామని అధికంగా దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఎవరైనా పాత ఇళ్లను కూల్చిన అదే ఇంటి నంబర్‌పై నూతన ఇంటి నిర్మాణం చేసుకుంటే మళ్లీ గ్రామ పంచాయతీ ఇంటి పర్మిషన్ తీసుకోవాల్సిందే. అంతే తప్ప నూతన ఇళ్లను నిర్మించు కోవద్దని పంచాయతీ సిబ్బందిని పంపి పనులు నిలిపి వేస్తున్నారు. దీంతో చేసేది ఏమిలేక మధ్యవర్తులతో అధికారులకు ముడుపులు చెల్లిస్తు ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారు. 40, 50ఏళ్లుగా పక్కా ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న ఇంటి నంబర్లను అసెస్‌మెంట్ గ్రామ పంచాయతీ చేయలేదు. దీంతో ఎవరైన ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా, మరెవరికి విక్రయించాలన్న ఇంటి నంబర్లు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. సదరు బాధితులు గ్రామ పంచాయతీకి వెళ్లి ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నిస్తే ముడుపులు ముడితేనే నమోదు చేస్తామని అంటున్నట్లు తెలిపారు. ఈ విషయంపై అధికారులు స్పందించి సమగ్రంగా విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

రేగొండ : మండల కేంద్రానికి చెందిన రైతులు యూరియా కోసం పరకాల–భూపాలపల్లి రహదారిపై గురువారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని సొసైటీకి ఉదయం 444 బస్తాల యూరియా రాగా, పంపిణీ చేస్తారని తెలుసుకున్న రైతులు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే బారులుదీరారు. రైతులకు సొసైటీ ఆధ్వర్యంలో ఒకరికి రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. కాగా అధికారులు పట్టా బుక్కులు ఉన్నవారికే పంపిణీ చేస్తామనడంతో రైతులు రహదారిపై ఆందోళన చేపట్టారు. యూరియా కొరత



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సెకండ్ ఎస్సై త్రిలోక్ రెడ్డి

లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ వాసుదేవారెడ్డి తెలిపారు.

గణపతికి ప్రత్యేక పూజలు



వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న శీనుబాబు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పలు వినాయక మండపాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు గురువారం దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీపీ సత్తమ్మ, మాజీ ఎంపీటీసీ మమత, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజబాపు, మెంగాని అశోక్, నాయకులు జానీ, షకీల్, అరుణ్, సత్యనారాయణ, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వరప్రసాద్, లక్ష్మన్, బాబా, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసమర్థతోనే యూరియా కొరత



ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : కాంగ్రెస్ అసమర్థతోనే రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు సరిపడా యూరియా అందిందని, నేడు కాంగ్రెస్ అసమర్థత వల్ల యూరియా కొరత వచ్చిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన తెలంగాణ మణిహారం కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నీళ్లు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని అన్నారు. రైతులను పూర్తి స్థాయిలో ఆదుకున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమన్నారు. ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు కేసీఆర్‌పై సీబీఐ కేసు వేస్తున్నారని, ఇప్పటికైనా కేసీఆర్‌పై సీబీఐ విచారణను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బందెల నరేష్, ఆది రఘు, కొలిపాక రాజయ్య, ఆకునూరి తిరుపతి, పోతనవేని ఐలయ్య, నిమ్మల స్వామి, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, నేరేళ్ల శ్రీనివాస్, పొన్నం చంద్రయ్య, చదువు మహేందర్‌రెడ్డి, ఉమేందర్ రావు, లాడి రవి, దాసారపు శ్రీనివాస్, గువ్వాడి లక్ష్మణ్, దేవరాజ్, శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా కొనసాగించాలి



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రయ్య

కాటారం : పారిశుద్ధ్య పనుల నిర్వాహణ సక్రమంగా కొనసాగించాలని డీఎల్‌పీఓ వీరభద్రయ్య పంచాయతీ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారులు, కాలనీల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారం తొలగించాలని, మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన

చిట్యాల : మండలంలోని నైన్‌పాక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నారు. గతేడాది పాఠశాలలో 75 మంది ఉండగా ఈ సంవత్సరం బాడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి 120 మంది విద్యార్థులను చేర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానోపాధ్యాయుడు పాముకుంట్ల తిరుపతయ్య, ఉపాధ్యాయులు శ్యాం సుందర్, సదానందం, అనిల్‌గవాస్కర్, ఈక్రమొద్దీన్, హసీనా సాకారంతో ప్రతి తరగతి గదిలో



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తిరుపతయ్య

టీవీలు ఏర్పాటు చేసి డిజిటల్ బోధన అందిస్తున్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈఓ రాజు

రేగొండ : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని కొత్తపల్లిగోరి మండల విద్యాధికారి రాజు అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కష్టపడితేనే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా మాధవీలత, లక్ష్మీ, సంజీవయ్య, జయమూర్తి, రాజేందర్, ఉమాదేవి, రాజమౌళి ఎంపిక కాగా వారిని శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా డీసీఈబీ సెక్రటరీ చంద్రశేఖర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్, చిన్నకోడేపాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితాదేవి, పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో ఖర్చు ఆదా..

టేకుమట్ల : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయ ఖర్చులు ఆదా చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కళ్యాణి అన్నారు. గురువారం మండలంలోని కుందనపల్లిలో వరి పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నానో యూరియాను డ్రోన్ సాయంతో వరి పంటలపై పిచికారీ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల ఖర్చును ఎక్కువగా తగ్గించుకోవడంతో పాటు, కూలీల సమస్యను అధిగమించవచ్చని అన్నారు. డ్రోన్‌తో పంటలకు పిచికారీ చేయడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ పని అవుతుందని, అలాగే రైతులు విషగాలిని పీల్చే సమస్యను



డ్రోన్‌తో నానో యూరియాను పిచికారీ చేస్తున్న రైతులు

సైతం తప్పించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాహుల్, రైతులు ఉన్నారు.

బస్సులు నిలపడం లేదు

ములుగు రూరల్ : జాకారం మినీ గురుకులం, గిరిజన యూనివర్సిటీ, సెల్ఫ్ మెనేజ్‌మెంట్ హాస్టల్స్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ల వద్ద ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని జాకారం మినీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు వాంకుడోత్ నిర్మల గురువారం ఆరోపించారు. ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఉద్యోగులకు గురుకులం వద్ద బస్సులు నిలపకపోవడంతో సమయానికి చేరుకోలేక పోతున్నామని అన్నారు. సాయంత్రం సమయంలో ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నిలపాలని రెక్వెస్ట్ చేసి నిలపకుండా వెళ్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆశ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

ఏటూరునాగారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ ఆశ వర్కర్ యూనియన్ జిల్లా 3వ మహాసభలు మడే శ్రావ్య, బొగ్గం సరిత అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు ర్యాలీ నిర్వహించారు. జయలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీంకు నిధులు తగ్గిస్తూ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా కార్మిక చట్టాలకు దూరం చేసే విధంగా పూనుకుందని ధ్వజమెత్తారు. ఆశ వర్కర్లను పారితోషికాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని అన్నారు. ఆశ వర్కర్లకు రూ.26వేలు కనీస వేతనం వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కమిషనర్ హామీ ప్రకారం యూనిఫాంలు, ప్రమాద బీమా జీఓ వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఆశ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ దావూద్, రత్నం రాజేందర్, ఉపాధ్యక్షులు కొప్పుల రఘుపతి, కట్ల నరసింహాచారి, గుండెబోయిన రవిగౌడ్, మడే రవి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క, ఆశ యూనియన్ నాయకురాలు అరుణ, కాలిక, కాసింబి, ప్రభావతి, రజిత, దేవి, పాప, రమాదేవి సుమారు 300 మంది పాల్గొన్నారు.

జాబితా నుంచి తొలగించాలి

వెంకటాపురం(కె) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. గురువారం గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

మంగపేట : ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని ఎంఈఓ పొదెం మేనక అన్నారు. మండంలోని కమలాపురం ఎంపీపీఎస్‌లో ఎఫ్ఎల్‌హెచ్‌ఎం చింత లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం మేనక ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల : సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో మూడు ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇళ్లను పరిశీలించి చాలా అందంగా నిర్మించుకున్నారని మెచ్చుకున్నారు. అలాగే ఇళ్లను త్వరగా పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసిన సందర్భంగా కొలుగూరి ప్రియాంక–సునీల్, మాచర్ల మౌనిక–శ్రీధర్, మాచర్ల ప్రసన్న–రాజేష్ దంపతులను శాలువాతో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూంలను నిర్మిస్తామని మోసం చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుతం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో యూరియా కొరత నెలకొందని, రైతులకు యూరియా సరిపడా అందించాలని పార్లమెంట్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారని గుర్తుచేశారు. రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటుంటే ఏనాడు రైతులను పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే యూరియా అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొమ్మను దహనం చేయడం సిగ్గు చేటన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ



ఇందిరమ్మ లబ్ధిదారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు

మోహిలాల్, ఎంపీఓ గౌడ సురేష్, మండల నాయకులు కత్తి సంపత్, చిరంజీవి, బోండ్ల మహేష్, అల్లం ఓదెలు, ఎలవేని రాజేందర్, వంగ కుమారస్వామి, నూనేటి రమేష్, కోరె చంద్రమౌళి, ఆనందం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

రేగొండ : మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఆలయ ఆవరణలో అధికారులు, గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రూ.12.15 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఓ రవికుమార్, తహశీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ భిక్షపతి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కాళేశ్వరం: సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి : మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా ఉపాధ్యాయుల పాత్రను పోషించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఉపాధ్యాయుల కృషిని అర్థం చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్హర్ : మండలంలోని పెద్దతూండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మానస ఆధ్వర్యంలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులు యాకూబ్ పాషా, ఐత మహేందర్, సుజాత, గోపికష్ణ, చంద్రప్రకాశ్, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయశంకర్ భూపాలపల్లి డీఐఈఓ డి.వెంకన్న హాజరయ్యారు. విద్యార్థులు



మొగుళ్లపల్లి : సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఉపన్యాసాలతో అలరించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎల్లప్పుడూ తమకు విద్యను బోధించే గురువుల పట్ల విధేయతతో మర్యాదలతో నడుచుకోవాలన్నారు. డీఐఈఓ వెంకన్న మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ బోర్డులో రాబోయే మార్పుల గురించి అదేవిధంగా బోర్డు ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌ను విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు కళాశాలకు హాజరు కావాలని విద్యను అభ్యసించాలని సూచించారు. కళాశాల విద్యార్థులు గతేడాది జరిగిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. లెక్చరర్లు, నాన్ టీచింగ్‌స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్ పాఠశాలలో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాలలో..



మల్హర్‌లో..

దివ్యాంగులను ప్రోత్సహించాలి

ములుగు : దివ్యాంగుల్లో ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించి తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ గుళ్లపల్లి సాంబయ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక నిర్ధారణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు సంకల్పంతో ముందుకెళ్లాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.